కథ :

బొద్దింక

నగ్నముని

పరమేశ్వర్‌గారిని రాజాపరమేశ్వర్‌గారు అనికూడా ఆ చుట్టుపక్కల అంటూ వుంటారు. నిజానికాయన రాజాకారు. ఆయన తాతలుకూడా రాజాలుకారు మరి రాజాలదగ్గర పనిచేశారు. భగవంతుడనేవాడు కొంతమందికి తెలివితేటలు, కొంతమందికి మట్టిబుర్రలు యివ్వడానికి వున్నాడు కాబట్టి, ఆ విషయాన్ని చక్కగా పసిగట్టిన పరమేశ్వర్ ముత్తాతగారు భువనేశ్వర్‌గారు భగవంతుడి మొదటి లిస్టులోనేవుంటూ, రాజావారి ఆస్తిపాస్తులకు మించిన ఆస్తుల్ని చేరవేశారు. భువనేశ్వర్‌గారి విగ్రహమే వేరు. ఆయన పద్ధతులే వేరు. ఆ ఠీవీ, ఆ బుంగమీసాలూ, ఆ తలపాగా, ఆయన గాంభీర్యమేవేరు. పరమేశ్వర్‌గారి హయాం వొచ్చేటప్పటికి ఆయనకేమీ రాజాననిపించుకోవాలనే తాపత్రయం లేనట్లుగా మెసిలేవారు. అప్పుడప్పుడూ సన్నిహితులవద్ద ఆమాట ఆయన బయటకుకూడా అనేవారు. ఆయన తనతండ్రితాతల అడుగుజాడలలో నడవాలనుకునేవారు. పాపభీతి, దైవచింతన ప్రజలలో కొరవడుతున్నందుకు ఆయన చాలా బాధపడేవారు.

పరమేశ్వర్‌గారికి యీ సోషలిజం అంటూ జనం, నాయకులూ యిట్లామాట్లాడుకోవడం యిష్టముండదని, ఆయనకు రాజరికమే మంచిదనీ, చక్కని తలపాగాతో ఏనుగంబారీనెక్కి, వెనకముందు అశ్వాలపై సైనికులు వస్తుంటే పరిపాలన చేయాలనే సరదావుంటుందనీ, అది యిప్పుడు నెరవేరేవీలులేనందుకు ఆయన చాలా బాధపడుతూ వుంటారని ఆయన సన్నిహితుల్లోనే కిట్టనివాళ్లు అంటూవుంటారు. కాని, పరమేశ్వర్‌గారు మాత్రం ఎప్పుడూ మాటతొణికేవారు కాదు ఆయన సహజ గంభీరుడు. ఎప్పుడూ చిరునవ్వునవ్వుతూ వుండేవారు. ఎంత ఎండలోనూ వెన్నెలలు చిందుతున్నట్లు నవ్వుతుండేవారు. ప్రజలంటే ఆయనకు ఎంతో యిష్టం. ఎయిర్ కండిషన్డ్ కారులో ప్రయాణం చేస్తూకూడా, ఆయన అప్పుడప్పుడు కారుదిగి, అంత ఎండలోనూ అక్కడక్కడ కాసేపు ఆగి ప్రజలతో మాట్లాడుతూవుండేవారు. వారు గత ఎన్నికలలో ఎంతో మెజారిటీతో అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ సమయంలో ప్రపంచంలో సారా

1091

అంతా ఆయన నియోజకవర్గంలోనే సముద్రంలా పురకలెత్తిందనీ, కొంతమంది ఆడవాళ్లు పట్నంనుంచొచ్చి కీలకమైన అధికారులకీ, అనధికారులకీ కాలక్షేపం కలిగించారని, రైసుమిల్లులలోనూ, స్కూలు బిల్డింగ్సులోనూ కొంతమంది వోటర్సు బయటికి రావడానికివీల్లేకుండా కుక్కబడ్డారని, నోట్లు కట్టలకుకట్టలు వెదజల్లబడ్డాయని యింకా చాలా చాలా పరమేశ్వర్‌గారంటే కుళ్లిపోయేవాళ్ళంతా ప్రచారం చేశారు. కాని, ఆయన మాత్రం వాళ్లపాపానికి వాళ్ళేపోతారన్నారు తప్ప ఒక్కమాట కూడా వాళ్ల మీద అనలేదు.

పరమేశ్వర్‌గారి పద్ధతులు చాలా భిన్నంగావుండేవి. ఆయన ఎంతో కష్టపడి తన పనులు తను చేసుకునేవారు. అయితే— కొన్నిపనులు మాత్రం ఆయన ఎందుకలా చేస్తారో ఎవరికీ అర్థమయ్యేదికాదు. ఉదాహరణకి— తూర్పునున్న ఆయన పదిహేనొందల ఎకరం మాగాణి తను దగ్గరేవుండి చూసుకోవడం ఆయనకి యిష్టంలేదు ఆయనకు కావలసిన మనుషులున్నారు. వారే ఆ వ్యవహారాలన్నీ చూస్తారు. దగ్గర వుంటే 'యీ అలగాజనికీ, యీ పెంట వెధవలకి' తన ఆస్తే గుర్తువస్తూవుంటుందని ఆయన మకాం హైదరాబాదుకి మార్చేశారు. పిల్లల చదువులకి వీలుగావుంటుందని ఆయన మకాం మార్చకతప్పలేదని, ఆ య న ఆ ఊరు వదలుతున్నప్పుడు చాలా బాధపడ్డారు.

కంపెనీలలో షేర్లున్నా, సొంత కంపెనీలున్నా నేరుగా ఆయన అక్కడకు వెళ్ళేవారుకాదు, ఆ వ్యవహారాలన్నీ ఆయనకు మనుషులున్నారు. వారే అంటిపండు వొలిచిపెట్టేవారు. ఆయనకు హైదరాబాదులో పెద్ద బర్రెలఫారం వున్నది. విదేశీజాతి బర్రెలు అక్కడ పాలసముద్రాలు తయారుజేసేవి. గవర్నమెంటువారు ఆయన పెంపకాన్ని మెచ్చి ఆయన అడక్కుండానే ఎన్నోవేలు దాని అభివృద్ధికి కేటాయించారు. ఆ బర్రెల వ్యవహారమంతా కూడా ఆయన మనుషులే చూస్తూవుండేవారు. పరమేశ్వర్ గారు కాగితాలు చూసేవారుతప్ప, బాంక్ ఎకౌంట్ చూసేవారుతప్ప ఎప్పుడూ ఒక్క బర్రెనుకూడా చేత్తోకూడా కొట్టి ఎరుగరు రాష్ట్రంలో చాలా ప్రాంతాలలో ప్రజలు ఆయన తోటల్లోంచి వొచ్చిన ద్రాక్షనే తింటారని చాలామందికి తెలియదు. ఆ వ్యవహారాలుకూడా ఆయన ప్రత్యక్షంగా చూసేవారుకాదు. ఆయన నల్లనోట్లు అక్కడే తెల్లగా మారతాయని ఆయన ప్రతికక్షులు అప్పుడప్పుడూ పత్రికలలో రాస్తూవుంటారు, కాని, పరమేశ్వర్‌గారు మాత్రం వారిని ఎప్పుడూ పల్లెత్తుమాట అనేవారుకాదు వాళ రాతలు వాళ్ళనే కొడతాయనుకునే వారాయన. ఆయన తోటల్నీ, దొడ్డుల్నీ, పొలాల్నీ,

1092

ఫ్యాక్టరీల్నీ, బ్రెల్నీ, కోళ్ళనీ, పచ్చగడ్డి తోటల్నీ, కూరగాయల తోటల్నీ, మందుల కంపెనీల్నీ యింకా సవాలక్ష వ్యాపారాల్నీ ఆయన శిష్యపరమాణువులు, ఆయన ఉద్యోగస్తులు కంటికిరెప్పలా కాపాడుతూవుండేవారు. ప్రభుత్వంవారు కూడా ఆయనతో ఏదీ సంప్రదించిగాని చేసేవారుకారు, అన్నిచోట్లా ఆయన మనుషులుండేవారు. ఇన్ని వున్నా పరమేశ్వర్ గారు నిగర్వి. ఆయనకి కోపం వచ్చినప్పుడు చూసినవారు లేరు. ఎందుకంటే– ఆయనకి కోపంవొస్తే యింక వారు యీలోకంలో వుండరని గిట్టనివాళ్లు అంటూ వుంటారు. అదివేరే సంగతి. ఆ గిట్టనివాళ్లే ఆయనకు చాలామంది ఆడవాళ్లతో సంబంధంవుందని అంటూవుంటారు. కాని, ఏ ఆడదానితోనూ ఆయన తిరగడం చూసినవాళ్ళెవరూ లేరు. ఆ విషయాలు చూడటానికికూడా ఆయనకు మనుషులున్నారని కాదు. ఆయన కొన్ని సొంతవిషయాల్లో మాత్రం చాలా జాగ్రత్తగా వుండేవారు. దానినాయన డిసిప్లిన్ అనేవారు. పబ్లిక్ ఇమేజ్ అనేవారు. ఆడవాళ్లయినా, మొగవాళ్ళయినాసరే, ఫలానా సమయంలో ఫలానాచోట పరమేశ్వర్ ఫలానావాళ్తో వుండాలనుకుంటే రెండోకంటికి తెలియకుండా ఆయన అక్కడవుండేవారు. అది అంతే. ఆయన తాగడం ఎవరూచూడలేదు, చివరకు సిగరెట్టుకూడా. కాని, ఎకౌంటులో అవికూడా వుండేవి. ఇటువంటి పనులు మాత్రం ఆయనే స్వయంగా చూసుకునేవారు. ఆయన తన నియోజకవర్గానికి పర్యటనకు వెళ్ళినప్పుడు అక్కడక్కడా ఆడపిల్లలు చనిపోతుండడం. పొలం గొడవల్లో రైతులు చనిపోతుండడం, యిటువంటివి కాకతాళీయంగా జరిగినా ప్రజలు మాత్రం ఆ మహానుభావుడికి ఆ పాపాన్ని అంటగట్టదలచుకోలేదు. ఆయన వారికష్టాలను ఎంతో సానుభూతితో వినేవారు.

ఆయన తరచుగా కొత్తగావొచ్చే సాధుపుంగవుల, బాబాల సన్నిధిలో కనబడేవారు; ఎప్పుడన్నా, మిత్రులు పట్టుబట్టినప్పుడు మోక్షాన్ని, దాన్నిచేరుకునే పద్ధతుల్ని గూర్చి మాట్లాడుతుండేవారు. ఆయన తమ ఎడమచేతికి తెలియకుండా దానధర్మాలు చేసేవారు. పత్రికలో ఫొటో వెయ్యందే ఏపనీ చెయ్యడని ఆ కిట్టనివాళ్లే అంటూ వుంటారు, అదివేరే విషయం.

రాజాపరమేశ్వర్ ఇంటికొచ్చేప్పటికి సాయంకాలం అయిదుదాటింది, అది ఇల్లు అన్నవాళ్ళనోట్లో పురుగులుపడతాయి. ఆ భవనంలో వెయ్యి కుటుంబాలు చులాగ్గా, సుఖంగా కాపరం చేసెయ్యొచ్చు. ఆయన కారుదిగి హాల్లో కాలుపెట్టేటప్పటికి ఓ పాతికమందికి పైగా తలపాగాలు గొంగళ్ళు వేసుకున్న అలగాజనం ఆయనకోసం ఎదురు చూస్తున్నారు. ఆ రాజభవనంలో వాళ్ళు కూచోవడం, నేలమీదే అయినా, [illegible]కి 1093

వొచ్చి కూచోవడం చాలా అసహ్యంగావుంది. పతివ్రతనోట్లోంచి, బూతులు వినబడ్డట్టుగా వుంది.

పరమేశ్వర్ అందరికీ నమస్కారంచేసి, కూర్చోమని సంజ్ఞ చేసి, లోపలికివెళ్ళి బట్టలు మార్చుకుని, ఒకగంట తరువాత బయటకువచ్చి, వాళ్ళు చెప్పిందంతావిని, తనకుతోచిన సహాయం తప్పక చేస్తానని వాళ్లకు హామీ యిచ్చి, పంపేసి సోఫాలో కూర్చుని, సెక్రెటరీని పిలిచి, 'చూడూ. ఇప్పుడొచ్చినవాళ్లు మన ఫొలం అక్కడ చేస్తున్నవాళ్ళలో కొంతమంది. ఒకకంట కనిపెట్టు, మన మనుషుల్ని వెంటనే పంపించు, అక్కడేదో గూడుపుఠాణీ జరిగేటట్లుంది. యీ ముండమోపి గవర్నమెంటులో మనకి రక్షణలేకండా పోతోంది, అంటూ సెక్రెటెరీకి తీసుకోవలసిన చర్యలనుగూర్చి వివరంగా చెప్పి, పైకి పర్సనల్ రూంలోకి వెళ్ళిపోయారు.

ఆయన పర్సనల్ రూంలోకి సెక్రెటరీయే కాదుగదా, ఆయన సహధర్మచారిణి కూడా వెళ్లకూడదు. అక్కడ గోడలకి బంగమీసాల. కిరీటాల తైలవర్ణ చిత్రాలూ, పెద్దపులుల తలకాయలూ తుపాకీలూ గోడలకి వేలాడి చూస్తూవుంటాయి. కింద అమెరికావాళ్ల కార్పెట్లు పరచివుంటాయి టేబుల్‌మీద డైరెక్టరీలో లేని నెంబర్సుగల టెలిఫోన్సు వుంటాయి ఇంకా చాలా విషయాలూ. వ్యవహారాలూ అక్కడ జరుగుతూ వుంటాయి. కాని, అక్కడ ఆయనతప్ప మరో నరుడెవడూ వుండడం మరో నరుడెవడూ చూడలేదు.

పరమేశ్వర్ పర్సనల్ రూంలోకెళ్ళి, ట్రంకాల్ బుక్‌చేసి. తన భూములగూర్చి యింకా తనభూముల కింద కలవబోయే ఆ ఊళ్లోని దేవాలయధూమాలగూర్చి ఎవరెవరితోనో మాట్లాడి, తను త్వరలోనే అటువైపు రాబోతున్నట్లు తెలియజేసి, తరువాత మరో యిద్దరు మంత్రులకూ పోలీసాఫీసర్సుకు ఫోన్‌చేసి, కాసేపు ఏవేవో కాగితాలు చూసుకుని భోజనం వైముదాటాకా కిందికి వొచ్చారు.

పరమేశ్వర్‌గారికి డైనింగ్ టేబుల్‌దగ్గర పిల్లలు కనబడలేదు. ఆయనకు ముగ్గురు రాజకుమారులు, ఒక రాకుమారివున్నారు. పిల్లలేరండీ అంటూ ఆయన భార్యను అడిగారు. వాళ్ళ భోజనాలైనై, రామారావుగారు ముందుగదిలో ఆడుకుంటున్నట్లుగా వుంది తక్కినవాళ్ళు పడుకున్నారు అందావిడ. పరమేశ్వర్‌గారికి కోపం వొచ్చింది. ఇంతవరకూ మేలుకునివుంటే వారి ఆరోగ్యం చెడిపోదూ అని విసుక్కుని, ఆయన ముందుగదిలోకొచ్చారు. అక్కడ కుమార్‌రాజా రామారావు నేలమీద కూర్చుని ఏదో చేస్తున్నాడు. పరమేశ్వర్‌గారికి రామారావు అట్లా నేలమీద అట్లా కూర్చోవడం

1094

ఆశ్చర్యం కలిగించింది. అంతకంటే ఆశ్చర్యం అంతరాత్రి అక్కడ ఆయన ఏమి చేస్తున్నారా అని. 'ఏం చేస్తున్నావ్ నాయనా' అన్నారాయన దగ్గరగావొస్తూ.

'ఏం లేదు డాడీ', అంటూ అతని చేతిలోవున్నదానిని మూలకు విసరేసి, 'డాడీ, భూస్వామి అంటే ఏమిటండీ' అని పరమేశ్వర్ దగ్గరకొచ్చి అడిగాడు. 'ఇప్పుడవన్నీ ఎందుకోయ్, పడుకోక, ఆరోగ్యం పాడవుతుంది. పడుకో నాయనా' ఆయనకి చాలా కోపం వొచ్చింది, కాని పిల్లలమీద ప్రదర్శించకూడదని అనుకుంటారాయన.

'భూస్వామి అంటే ఏమిటి డాడీ' అని రెట్టించాడు రామారావు 'భూస్వామి అంటే, ప్రజలకు భూమిని దున్నుకోడానికి యిచ్చి, ప్రజల జీవితాలను నిలబెట్టేవాడు, ఆయన లేకపోతే ప్రజలు తిండిలేక మలమల మాడిపోతారు.... అవన్నీ ఇప్పుడెందుకు, నువ్వెళ్లిపడుకో' అని ఆయన అక్కడనుండి వెళ్ళబోయారు.

'కాదూ భూస్వామి అంటే, అంటే బొద్దింక అంటగాదా. బొద్దింకల్ని చంపాలంటగధా, ఇవాళ మన యింటి పక్కనుండి చాలామంది అరుచుకుంటూ వెళ్లారు డాడీ వాళ్లచేతుల్లో అట్టలున్నాయ్. భూస్వామంటే క్రూరుడంటగా, రాక్షసుడంటగా, మరి బొద్దింక రాక్షసుడా డాడీ .

పరమేశ్వర్‌గారు కోపంతో వొడికిపొయ్యారు. పరమేశ్వర్‌గారు పలక్కపోవడంతో రామారావు మళ్లీ రెట్టించి— 'పో డాడీ నువ్వెప్పుడూ యింతే' అంటూ రామారావు మళ్లీ గదిలో మూలకువెళ్లి, తను పారేసినదానిని నెతికి పుల్లతోనెడుతూ బయటకు లాగాడు నేలమీద కాళ్లతెగి, వెల్లకిలలాపడి తన్నుకుంటూన్న బొద్దింకను చూస్తూ రామారావు ఉండుండి పుల్లతో గుచ్చుతూ నవ్వుకుంటున్నాడు.

పరమేశ్వర్‌గారు ఆ రాత్రి భోజనం చెయ్యలేదు. ఆయన జీవితంలో ఎప్పుడూ మాననిది భోజనం.

1095